తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
వరంగల్ - ఆదిలాబాద్
హన్మకొండ | జనగాం | ములుగు నిర్మల్ | మంచిర్యాల
ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి కొమురం భీం ఆసిఫాబాద్
మహబూబాబాద్
ఆదివారం
4 అక్టోబర్ 2026
పేజీలు - 12

## నాలుగు నెలల్లో నాలుగు అంతస్తులు..

- భూపాలపల్లి ఓపెన్‌కాస్ట్‌కు 2 కి.మీ. దూరంలోనే భవనం..!
- కాసం ఫ్యాషన్స్ భవనంపై భద్రతా ప్రశ్నలు!
- అనుమతులున్నాయా..? నిబంధనలు పాటించారా..?
- సేఫ్టీ సర్టిఫికెట్లు ఉన్నాయా..?
- వందలాది మంది కస్టమర్లు వచ్చే భవనంపై అధికారుల తనిఖీలు జరిగాయా..?

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి పట్టణ ప్రధాన రహదారిపై మరో భారీ కమర్షియల్ భవనం ప్రారంభానికి సిద్ధమైంది. అక్టోబర్ 5న ప్రముఖ నటి నిధి అగర్వాల్ చేతుల మీదుగా ప్రారంభం కానున్న కాసం ఫ్యాషన్స్ నూతన షోరూం ఇప్పుడు పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. వ్యాపార సంస్థగా భారీ స్థాయిలో రూపుదిద్దుకున్న ఈ భవనం నిర్మాణ వేగమే ఇప్పుడు పలు ప్రశ్నలకు కారణమవుతోంది. భూపాలపల్లి ఓపెన్‌కాస్ట్ గనికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాంతంలో నాలుగు అంతస్తుల భారీ భవనాన్ని కేవలం నాలుగు నెలల్లోనే నిర్మించడం సాధ్యమేనా? నిర్మాణ సమయంలో అన్ని నిబంధనలు పాటించారా? నిర్మాణ నాణ్యత, భవన స్థిరత్వం, అగ్నిమాపక భద్రత, పార్కింగ్, అత్యవసర మార్గాలు తదితర అంశాలను సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించారా? అన్నది ఇప్పుడు ప్రజల్లో చర్చకు దారితీస్తోంది.

### నాలుగు నెలల్లోనే ఇంత భారీ నిర్మాణమా?

సాధారణంగా భారీ కమర్షియల్ భవన నిర్మాణానికి స్థలం ఎంపిక నుంచి అనుమతులు, ఫౌండేషన్, పిల్లర్లు, స్లాబ్‌లు, కాంక్రీట్ క్యూరింగ్, ఎలివేషన్, విద్యుత్ వ్యవస్థ, ఫైర్ సేఫ్టీ, ఇంటీరియర్ పనులు ఇలా అనేక దశలు ఉంటాయి. అయితే కాసం ఫ్యాషన్స్ భవనం మాత్రం అతి తక్కువ వ్యవధిలోనే నాలుగు అంతస్తుల నిర్మాణంతో ప్రారంభానికి సిద్ధం కావడం ఆసక్తికరంగా మారింది. భారీ సంఖ్యలో కార్మికులను ఏర్పాటు చేసి పనులను వేగవంతంగా పూర్తి చేసినట్లు తెలుస్తున్నప్పటికీ.. నిర్మాణ వేగం కంటే నిర్మాణ భద్రతకు ప్రాధాన్యం ఇచ్చారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా స్లాబ్‌ల మధ్య కాంక్రీట్ క్యూరింగ్‌కు అవసరమైన సమయం, నిర్మాణం సెటిల్ అయ్యే ప్రక్రియ, లోడ్ బేరింగ్ సామర్థ్యం వంటి అంశాలను నిపుణులు పరిశీలించారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

### ఓపెన్‌కాస్ట్‌కు ఇంత సమీపంలో..!

భూపాలపల్లి పట్టణం సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనుల ప్రభావిత ప్రాంతంలో ఉంది. కాసం ఫ్యాషన్స్ నూతన భవనం ఓపెన్‌కాస్ట్ గనికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలోనే ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇలాంటి ప్రాంతాల్లో భారీ నిర్మాణాలకు సంబంధించి వర్తించే మిగతా 2లో..








## కొమరం భీమ్ 86వ వర్ధంతికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- జోడేఘాట్‌లో ఏర్పాట్లపై సమీక్షించిన జిల్లా కలెక్టర్ కె. హరిత, ఐటీడీఏ పీఓ మంద మకరందు

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 03(జనంసాక్షి ):** కొమరం భీమ్ 86వ వర్ధంతి కార్యక్రమాన్ని ఈ నెల 26వ తేదీన జోడేఘాట్‌లో ఘనంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె. హరిత, సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ప్రాజెక్టు అధికారి మంద మకరందు అధికారులను ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం కెరమెరి మండలం జోడేఘాట్‌లో కొమరం భీమ్ 86వ వర్ధంతి కార్యక్రమం ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ కె. హరిత, ఐటీడీఏ పీఓ మంద మకరందం వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 26న నిర్వహించనున్న వర్ధంతి కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో గిరిజనులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు హాజరయ్యే అవకాశం ఉన్నందున, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమానికి వచ్చే ప్రజల సౌకర్యార్థం తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, రవాణా, పార్కింగ్, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమ ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణను మిగతా 2లో..



## దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాల ఆహ్వాన పత్రిక జిల్లా కలెక్టర్ కు అందజేత

**హనుమకొండ ప్రతినిధి అక్టోబర్3 (జనం సాక్షి ) :** హనుమకొండ భద్రకాళి దేవాలయంలో నిర్వహించనున్న శరన్నవరాత్రుల మహోత్సవాల సందర్భంగా నిర్వహించే ప్రత్యేక ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి కి దేవాలయ ఆలయ కార్య నిర్వహణ అధికారి సునీత, ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు ఆహ్వాన పత్రికను శనివారం కలెక్టరేట్ లో అందజేశారు.భద్రకాళి దేవాలయంలో దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలలో భాగంగా ఈ నెల 11 నుంచి 21వ తేదీ వరకు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు, కల్యాణోత్సవం, ఊరేగింపు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కు ఆలయ ఈవో, ప్రధానార్చకులు తెలిపారు. ఈ కార్యక్రమాలకు జిల్లా కలెక్టర్ తప్పకుండ విచ్చేయాలని వారు కోరారు.

## న్యాయ పోరాటంతో రైతుల విజయం

- బుయ్యారంలో రైతుల సంబరాలు
- నాగలితో దున్నిన బిజెపి రాష్ట్ర నేత కొయ్యల ఏమాజి



**బెల్లంపల్లి, అక్టోబర్ 3, (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాలతో వేమనపల్లి మండలం బుయ్యారం గ్రామంలో రైతుల కళ్లల్లో ఆనందం కలిగింది. అనేక పోరాటాలు చేసి, చివరికి న్యాయ పోరాటంతో రైతులు విజయం సాధించారు. బుయ్యారం గ్రామంలో వారి భూములను దుక్కి దున్ని బాజా భజంత్రీలతో ర్యాలీ నిర్వహించి సంబరాలు చేసుకున్నారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జడ్పీటీసీల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కొయ్యల ఏమాజి ఆధ్వర్యంలో రైతుల భూముల్లో దుక్కి దున్నారు. ఈ సందర్భంగా కొయ్యల ఏమాజి మాట్లాడుతూ న్యాయ పోరాటంతో రైతులు విజయం సాధించారని అన్నారు. పేద రైతులకు భూములు దక్కేలా చేసిన న్యాయస్థానానికి ధన్యవాదాలు తెలిపారు. గత అనేక సంవత్సరాలుగా రైతులు సాగు చేసుకుంటున్న భూముల్లో అటవీశాఖ అధికారులు జోక్యం చేసుకొని వారిని వేధిస్తూ, అక్రమ కేసులు బనాయిస్తు ఆక్రమించుకుంటుంటే స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ దున్నపోతు మీద వర్షం పడ్డా చందంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే వినోద్ రైతుల సమస్యల గురించి పట్టించుకోవడం లేదని, ప్రజల సమస్యలు పట్టించుకోనీ ఎమ్మెల్యే గడ్డం వినోద్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అటవీశాఖ అధికారులు రైతుల భూములు కబ్జా చేస్తే ప్రతి దాడులు చేయడానికి కూడా వెనుకాడరని హెచ్చరించారు. గత యాభై ఏళ్లుగా అనేక మంది రైతులు సాగు చేస్తున్న భూములను అటవీ శాఖ అధికారులు అక్రమంగా ఆక్రమించుకొని వారికి ఉపాధి లేకుండా చేస్తున్నారని అన్నారు. వారికి ప్రభుత్వం పట్టాలు కూడా మంజూరు చేసిందని తెలిపారు. అప్పటి నుండి రైతులు సాగు చేస్తున్నారని అన్నారు. కానీ అటవీశాఖ అధికారులు ఇటీవల జోక్యం చేసుకొని రైతుల పై తప్పుడు కేసులు నమోదు చేసి జైలుకు పంపి వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని చేలల్లో వెళ్లకుండా సాగు చేయకుండా అడ్డుకుంటున్నారని అన్నారు. దీనివల్ల పేద రైతులు కష్టాలు పడుతున్నారని అన్నారు. వారికి అన్ని హక్కులున్నా అటవీశాఖ అధికారులు అడ్డుకోవడం శోచనీయం అన్నారు. అటవీశాఖ అధికారులు రైతుల జోలికి పోవద్దని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం పేద రైతుల భూములు టార్గెట్ చేసుకొని వ్యాపారం చేస్తున్నదని అన్నారు. 22ఏ పేరుతో లక్షల ఎకరాల భూములు నిషేధిత జాబితాలో ఉన్నాయని తెలిపారు. పేదల భూములను అటవీ శాఖ అధికారులు బలవంతంగా కబ్జాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఎమ్మెల్యే వినోద్ రైతుల సమస్యలు పట్టించుకోవాలని , లేకుంటే పేదల ఉసురు తగులుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు పులగం తిరుపతి, కేశవ్ రెడ్డి, మహిళా మోర్చ మండల అధ్యక్షులు ముదిమడుగుల లావణ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు శనిగారపు శ్రావణ్, కల్లేపల్లి నవీన్, ఎస్సీ మోరచ్చ జిల్లా నాయకులు నర్సింగ్, శ్రీనివాస్, రాజ కుమార్, ప్రశాంత్, అవినాష్, నాయకులు ముల్కల సత్యనారాయణ, జుమిడీ వెంకటేష్, ముడిమడుగుల శంకర్, పోషం, గోగర్ల లక్ష్మి రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు నెలల్లో నాలుగు అంతస్తులు..

నిబంధనలు, భద్రతా ప్రమాణాలు, సంబంధిత శాఖల అనుమతులు కీలకంగా ఉంటాయి. దీంతో ఈ భవనానికి సంబంధించిన అనుమతులపై ఇప్పుడు చర్చ మొదలైంది. నిర్మాణ ఎత్తుకు అనుగుణంగా అవసరమైన అనుమతులు పొందారా? సింగరేణి నుంచి అవసరమైన ఎన్‌ఓసీ తీసుకున్నారా? సంబంధిత మైనింగ్/భద్రతా అధికారుల నుంచి ఏమైనా అభ్యంతరాలు ఉన్నాయా? అన్నది అధికారులు స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది.

జీ-2.. జీ-3 నిబంధనల సంగతేంటి?

కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో భారీ నిర్మాణాలకు వర్తించే నిబంధనలపై ప్రజల్లో భిన్నమైన చర్చ జరుగుతోంది. సాధారణంగా ఇలాంటి ప్రాంతాల్లో నిర్మాణ ఎత్తు, భవన వినియోగం, గనుల సమీపం, భద్రత తదితర అంశాల ఆధారంగా అనుమతులు అవసరమవుతాయని స్థానికులు చెబుతున్నారు. అయితే కాసం ఫ్యాషన్స్ భవనానికి ఎన్ని అంతస్తులకు అనుమతి ఇచ్చారు? అనుమతించిన ఎత్తు ఎంత? నిర్మాణంలో నాలుగు అంతస్తులకు సంబంధించిన అనుమతి ఉందా? అన్న వివరాలు బహిర్గతం కావాల్సి ఉంది. అవసరమైన చోట సింగరేణి, డీజీఎంఎస్ లేదా ఇతర సంబంధిత శాఖల నుంచి అనుమతులు తీసుకున్నారా? లేదా? అనే ప్రశ్నలకు అధికారులే సమాధానం చెప్పాలి. అక్టోబర్ 5న ప్రారంభోత్సవం కోసం భవనాన్ని ముస్తాబు చేస్తున్నప్పటికీ.. అక్కడక్కడా నిర్మాణ, ఫినిషింగ్ పనులు కొనసాగుతున్నట్లు కనిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. భారీ షోరూం ప్రారంభానికి ముందే అన్ని నిర్మాణ పనులు, విద్యుత్ ఏర్పాట్లు, ఫైర్ సేఫ్టీ వ్యవస్థ, అత్యవసర మార్గాలు, పార్కింగ్ తదితర అంశాలు పూర్తయ్యాయా? అన్నదే ప్రశ్న. వందలాది మంది వినియోగదారులు ఒకేసారి భవనంలోకి వచ్చే అవకాశం ఉన్నందున చిన్నపాటి లోపం కూడా పెద్ద ప్రమాదానికి దారితీసే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఫైర్ సేఫ్టీపై స్పష్టత ఏది?

భారీ కమర్షియల్ షోరూంకు ఫైర్ సేఫ్టీ అత్యంత కీలక అంశం. భవనంలో ఫైర్ ఫైటింగ్ పరికరాలు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, అగ్నిమాపక వాహనాలు చేరుకునే అవకాశం, విద్యుత్ భద్రతా ఏర్పాట్లు, ఇతర అత్యవసర సదుపాయాలు నిబంధనల ప్రకారం ఉన్నాయా? అన్నది పరిశీలించాల్సి ఉంది. సంబంధిత ఫైర్ శాఖ అధికారులు భవనాన్ని తనిఖీ చేసి ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ జారీ చేశారా? అన్న విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని స్థానికులు కోరుతున్నారు.

పార్కింగ్ సమస్యకు పరిష్కారం ఉందా?

భూపాలపల్లి పట్టణంలోని ప్రధాన రహదారిపై ఉన్న ఈ భారీ షోరూంకు పండుగ సీజన్‌లో పెద్ద సంఖ్యలో వినియోగదారులు వచ్చే అవకాశం ఉంది. దీంతో కార్లు, ద్విచక్ర వాహనాల రాకపోకలు పెరిగితే ప్రధాన రహదారిపై ట్రాఫిక్ సమస్య తలెత్తే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. భవనానికి అనుగుణంగా పార్కింగ్ స్థలం కేటాయించారా? వాహనాల పార్కింగ్ కోసం మున్సిపల్ నిబంధనలు పాటించారా? ఫైర్ వాహనాలు అత్యవసర సమయంలో భవనం చుట్టూ తిరిగేంత స్థలం ఉందా? అనే అంశాలను అధికారులు పరిశీలించాల్సి ఉంది.

స్ట్రక్చరల్ స్టెబిలిటీపై పరీక్ష జరిగిందా?

నాలుగు అంతస్తుల భవనం కావడంతో నిర్మాణ స్థిరత్వం అత్యంత ముఖ్యమైన అంశంగా మారింది. భవన నిర్మాణానికి ముందు మట్టి స్వభావం, ఫౌండేషన్ సామర్థ్యం, పిల్లర్లు, బీములు, స్లాబ్ లోడ్ బేరింగ్ సామర్థ్యం తదితర అంశాలను నిపుణులు పరిశీలించారా? నిర్మాణం పూర్తయిన తర్వాత స్ట్రక్చరల్ స్టెబిలిటీ సర్టిఫికెట్ తీసుకున్నారా? అన్నది ప్రశ్న. ఈ వివరాలు బయటకు వస్తేనే భవనం భద్రతపై ప్రజలకు స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

అనుమతులు ఎక్కడ.. ధ్రువపత్రాలు ఏమిటి?

భవనం నిర్మాణానికి సంబంధించిన మున్సిపల్ బిల్డింగ్ పర్మిషన్, లేఅవుట్/ప్లాన్ అనుమతులు, ఫైర్ సేఫ్టీ, స్ట్రక్చరల్ స్టెబిలిటీ, విద్యుత్ భద్రత, అవసరమైన సింగరేణి లేదా ఇతర శాఖల ఎన్‌ఓసీలు, పార్కింగ్ ఏర్పాట్లకు సంబంధించిన అనుమతులు తదితర వివరాలను అధికారులు పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. అనుమతులు సక్రమంగా ఉంటే వాటిపై స్పష్టత ఇవ్వడం ద్వారా ప్రజల్లో నెలకొన్న అనుమానాలకు తెరపడుతుందని అంటున్నారు.

ప్రారంభానికి ముందే తనిఖీలు చేయాలి..

పండుగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రారంభోత్సవాన్ని హడావిడిగా నిర్వహించడం కంటే ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. ప్రారంభోత్సవం తర్వాత ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు భవనంలోకి వచ్చే అవకాశం ఉన్నందున ముందుగానే అన్ని భద్రతా ప్రమాణాలను అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. భవనం నిర్మాణంలో ఏవైనా నిబంధనల ఉల్లంఘనలు ఉంటే వాటిని గుర్తించి సరిదిద్దిన తర్వాతే ప్రజల వినియోగానికి అనుమతించాలని కోరుతున్నారు.

ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?

భారీ కమర్షియల్ భవనంలో ప్రతిరోజూ వందలాది మంది కస్టమర్లు, సిబ్బంది రాకపోకలు సాగించే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో భవన నిర్మాణంలో చిన్న లోపం ఉన్నా, అగ్నిప్రమాదం జరిగినా, అత్యవసర పరిస్థితి తలెత్తినా దాని ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. అందుకే "ప్రారంభానికి ముందే అన్ని అనుమతులు ఉన్నాయా? భద్రతా ప్రమాణాలు పూర్తిగా పాటించారా? అధికారులు భవనాన్ని తనిఖీ చేశారా?" అన్న ప్రశ్నలకు సమాధానాలు రావాల్సిన అవసరం ఉంది. కాసం ఫ్యాషన్స్ భవనంపై స్థానికంగా వ్యక్తమవుతున్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది. భవన నిర్మాణానికి సంబంధించిన అనుమతులను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం నిర్మాణం జరిగిందా లేదా అన్నదానిపై స్పష్టమైన నివేదిక ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. అనుమతులు సక్రమంగా ఉంటే ప్రజలకు వెల్లడించాలి.. లోపాలుంటే సరిదిద్దిన తర్వాతే ప్రారంభానికి అనుమతించాలి అని వారు డిమాండ్ చేస్తున్నారు.

## కొమరం భీమ్ 86వ వర్ధంతికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన సంఖ్యలో తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీటి వసతులను ఏర్పాటు చేయాలని తెలిపారు. అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వైద్య సిబ్బందిని, అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలని, ప్రాథమిక వైద్య సేవల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమానికి వచ్చే వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా పార్కింగ్ ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ట్రాఫిక్ నియంత్రణకు తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు సులభంగా కార్యక్రమ ప్రాంగణానికి చేరుకునేలా రహదారుల నిర్వహణ, సూచిక బోర్డులు, స్వాగత ఏర్పాట్లు, సమాచార కేంద్రాలు, సహాయక సిబ్బందిని ఏర్పాటు చేయాలని తెలిపారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులు, దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కొమరం భీమ్ జీవితం, ఆయన పోరాట స్ఫూర్తి, ఆదివాసీల హక్కుల కోసం చేసిన ఉద్యమాన్ని ప్రతిబింబించేలా వర్ధంతి కార్యక్రమ నిర్వహణ ఉండాలని జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ సూచించారు. గిరిజన సంప్రదాయాలు, సంస్కృతి, ఆచారాలకు అనుగుణంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలని తెలిపారు. ఈ సందర్భంగా కొమరం భీమ్ మనవడు సోనేరావు, వివిధ గిరిజన సంఘాల నాయకులు, ప్రతినిధులు తమ సూచనలు, అభిప్రాయాలను జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ దృష్టికి తీసుకువచ్చారు. వర్ధంతి కార్యక్రమంలో గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యత కల్పిస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. వర్ధంతి కార్యక్రమానికి సంబంధించి శాఖల వారీగా అప్పగించిన బాధ్యతలను అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని, ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. హరిత, ఐటీడీఏ పీఓ మంద మకరందం ఆదేశించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, కొమురం భీం మనవడు సోనేరావు, గిరిజన సంఘాల నాయకులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




## నెక్కొండ జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహావిష్కరణ

నెక్కొండ అక్టోబర్ 3 (జనం సాక్షి): నెక్కొండ మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ చింతం ప్రవీణ్ కుమార్, ఈ విగ్రహాన్ని పాఠశాలకు బహూకరించారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధికి 1986-87 బ్యాచ్ సేవలు పాఠశాల విద్యార్థుల దుస్తుల మరమ్మతుల కోసం కుట్టు మిషన్, విద్యార్థులకు పుస్తకాలు కూడా బహూకరించారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ గ్రామ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్ , మండల ఎంఈఓ రవీందర్ , 1986-87 బ్యాచ్ పూర్వ విద్యార్థులు గటిక అజయ్ కుమార్ , కొమరవెల్లి సతీష్ , రాపాక శ్రీనివాస్,రవీంద్రనాథ్, మాలోతు ప్రతాప్ సింగ్ , గణేష్ , రావుల భాస్కర్ రెడ్డి , మూర్తి , పరమాత్మ ,బిచ్యానాయక్, నెక్కొండ గ్రామ ప్రముఖులు చల్లాగోతం రెడ్డి , ఎండి మదర్ , తాటిపల్లి శివకుమార్ , ఈదునూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆశ్రమ బాలికల పాఠశాలలో ఐటీడీఏ పీఓ ఆకస్మిక తనిఖీ

నల్లబెల్లి, అక్టోబర్ 03 (జనంసాక్షి): : మండలంలోని మూడుచెక్కలపల్లి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యా ప్రమాణాలు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతి గదులు, పాఠశాల పరిసరాలు, వచ్చదనం, భోజన వసతులు, మెనూ అమలు తీరును పరిశీలించారు. విద్యా ప్రమాణాలకు సంబంధించిన అంశాలపై ఉపాధ్యాయులు, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని లైబ్రరీ, సైన్స్ ల్యాబొరేటరీలను సందర్శించి విద్యార్థులకు అందుబాటులో ఉన్న విద్యా వనరులను పరిశీలించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో స్వయంగా అతను మాట్లాడారు. వారి విద్యాభ్యాసం, చదువులో ఎదురవుతున్న సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో



ఏమైనా సమస్యలు ఎదురైతే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. క్రమశిక్షణతో పట్టుదలగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థులు చెప్పిన సమస్యల పరిష్కారానికి అవసరమైన సూచనలు చేశారు. ఈ తనిఖీలో డిటిడిఓ ఏ. నారాయణరెడ్డి, ఏసిఎంఓ ఎం. శ్రీనివాస్, స్పోర్ట్స్ ఆఫీసర్ బి. దేవుల, ప్రధానోపాధ్యాయులు బి. రామయ్య, డిప్యూటీ వార్డెన్ జె. వీరమ్మతో పాటు ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వైఫల్యాలకు పట్టభద్రుల ఓటుతో గుణపాఠం: ఇప్ప పృథ్వి రెడ్డి

దేవరుప్పుల, అక్టోబర్ 3 (జనం సాక్షి) : కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు తమ ఓటుతో సమాధానం చెప్పాలని ఉస్మానియా విద్యార్థి జేఏసీ నేత ఇప్ప పృథ్వి రెడ్డి పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి నిరుద్యోగ



యువతను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. అర్హత కలిగిన పట్టభద్రులు నవంబర్ 6లోపు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పట్టభద్రుల ఓటు ప్రభుత్వాన్ని ప్రశ్నించే ఆయుధమని ఇప్ప పృథ్వి రెడ్డి పేర్కొన్నారు.

## విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

ఇంటర్నేషనల్ సింబయాసిస్ యూనివర్సిటీ ప్రొఫెసర్, డైరెక్టర్ చిట్ట శ్యాంసుందర్



చెన్నారావుపేట, అక్టోబర్ 3( జనం సాక్షి): విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఇంటర్నేషనల్ సింబయాసిస్ యూనివర్సిటీ ప్రొఫెసర్, డైరెక్టర్ చిట్ట శ్యాంసుందర్ అన్నారు.శనివారం మండలంలోని అమీనాబాద్ మోడల్ స్కూల్ లో 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు వివిధ విద్యా, కెరీర్ అవకాశాలపై అవగాహన కల్పించారు.విద్యార్థులు ఇతరులను అనుసరించకుండా తమ ఆసక్తి, బలాలు, సామర్థ్యం, అభిరుచులకు అనుగుణంగా సరైన సబ్జెక్ట్, కోర్సుల ను ఎంచుకోవాలన్నారు. ఒక విద్యార్థి భవిష్యత్ కెరీర్‌ను నిర్ణయించుకునే ముందు తనకు ఏ రంగంలో ఆసక్తి ఉందో ఏ నైపుణ్యాలు ఉన్నాయో తెలుసుకోవడం ముఖ్యమని వివరించారు. అనంతరం ఆయనను ఉపాధ్యాయులు శాలువాకప్పి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చిట్ట జ్యోతి, ఉపాధ్యాయులు యాకయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

# పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజం

- అంగన్వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలి
- పోషణ మాసోత్సవంలో చిట్యాల తహసీల్దార్ వసంతరావు



**చిట్యాల, అక్టోబర్ 3( జనం సాక్షి):**గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పూర్తిస్థాయి పోషకాహారాన్ని భుజించాలని చిట్యాల తహసీల్దార్ తూకుంట్ల వసంతరావు పిలుపునిచ్చారు. శనివారం చిట్యాల మండలం తిరుమలాపురం గ్రామంలో ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్లు అప్సర, సునీత ఆధ్వర్యంలో నిర్వహించిన 'మండల స్థాయి పోషణ మాసోత్సవ' కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ముందస్తు విద్య, ఆటపాటలతో పాటు గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు బలవర్ధకమైన ఆహారం, చిక్కీ ప్యాకెట్లను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ రోగాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామీణ మహిళల్లో పోషకాహారం, పరిశుభ్రతపై అంగన్వాడీ టీచర్లు నిరంతరం అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్ హెచ్‌పీ డాక్టర్ లింగంపల్లి రాకేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మాట్లాడుతూ.. పోషణ మాసోత్సవ ప్రత్యేకతను, శిశువు పుట్టిన మొదటి వెయ్యి రోజుల ప్రాముఖ్యతను వివరించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఆహారంలో తృణధాన్యాలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఆయాలు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.



## విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

- యజమానికి రూ.40 వేల పరిహారం

**దేవరుప్పుల, అక్టోబర్ 3 (జనం సాక్షి) :** దేవరుప్పుల మండలం రాంబోజీగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని రాజీవ్‌నగర్‌కు చెందిన మేడ నర్సయ్యకు చెందిన ఎద్దు విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. దీంతో ఎద్దును కోల్పోయిన మేడ నర్సయ్యకు విద్యుత్ అధికారులు రూ.40 వేల పరిహారాన్ని అందజేశారు. బాధిత రైతుకు నష్టపరిహారం అందించే చర్యల్లో భాగంగా విద్యుత్ అధికారులు ఈ మొత్తాన్ని అందించినట్లు తెలిపారు.

## పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

- పాలకుర్తిలో స్పెషల్ డ్రైవ్ లో పాల్గొన్న ఎంపీడీవో



**పాలకుర్తి, అక్టోబరు 3(జనంసాక్షి) :** పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) వర్కల వేదవతి అన్నారు. శనివారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో పరిశుభ్రతపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వేదవతి పాలకుర్తి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో సర్పంచు సర్పంచ్ కమ్మగాని విజయ నాగన్న గౌడ్ తో కలిసి చీపురు పట్టుకొని రోడ్డును ఊడ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం చిదురాల శ్రీనివాస్. సర్పంచులు రేణుక, సోమన్న, యాకూబ్, బుజ్జి, బాలగాని రజిత, కారుపోతుల శ్రీనివాస్, కల్పన, బానోత్ మహేందర్. పసులాది యాకస్వామి. జిట్టబోయిన రమ్య, పద్మ, మాచెర్ల స్వరూప, గాదరి కుమార్. వార్డు సభ్యులు కమ్మగాని శ్రీకాంత్. మామిండ్ల కవిత- శోభన్ బాబు. తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లలో స్లాబ్ పరిమితి జీవో 352 రద్దు చేయాలి

- కుల సంఘాల జేఏసీ డిమాండ్..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ఇందిరమ్మ ఇళ్ల పథకంలో స్లాబ్ ఏరియా 750 చదరపు అడుగులు దాటితే బిల్లులు నిలిపివేస్తామంటూ అధికారులు నోటీసులు ఇవ్వడం పేదలను ఇబ్బందులకు గురిచేస్తోందని కుల సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ పీక కిరణ్ అన్నారు. జీవో నెం. 352ను రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం హౌసింగ్ పీడీకి వినతిపత్రం అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉమ్మడి కుటుంబాలు ఎక్కువగా ఉండటంతో 400-600 చ.అ. ప్లింత్ ఏరియా సరిపోవడం లేదని, లబ్ధిదారులు అప్పులు చేసి బాల్కనీ, మెట్ల వైపు అదనంగా నిర్మిస్తే బిల్లులు ఆపడం అన్యాయమని అన్నారు. కాంట్రాక్టర్లు కూడా అదనపు ఖర్చు భరించలేక పనులు మధ్యలోనే నిలిపివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిలిపివేసిన బిల్లులను వెంటనే విడుదల చేసి, జీవో 352లోని కఠిన నిబంధనలను సడలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ కో కన్వీనర్ రామగిరి రాజు, పుల్యాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాఘవరెడ్డిపేట పాఠశాలలో ఉచిత దుస్తుల పంపిణీ



**టేకుమట్ల అక్టోబర్ 03 (జనంసాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా, టేకుమట్ల మండలం, రాఘవరెడ్డిపేట గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలోని ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత దుస్తుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సర్పంచ్ వంగ మమత – శ్రీధర్ గౌడ్ చేతుల మీదుగా విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వంగ మమత శ్రీధర్ మాట్లాడుతూ – "ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి ఆత్మవిశ్వాసంతో ఉండాలి, చదువులో ముందుండాలి అనే ఉద్దేశంతో ఈ చిన్న సహాయం ప్రభుత్వం చేస్తుంది అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు గోసిక పద్మ , ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, గ్రామ పెద్దలు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటు చోరీపై ఇండియా కూటమి పార్టీల అఖిల పక్ష సమావేశం



**బచ్చన్నపేట అక్టోబర్ 3 ( జనం సాక్షి):** ఓటు చోరీకి వ్యతిరేకంగా ఇండియా కూటమి పార్టీలు అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మొహమ్మద్ మసూద్, సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్.మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, ప్రతి ఓటు స్వేచ్ఛగా, పారదర్శకంగా నమోదై వినియోగించుకునేలా ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఓటర్ల జాబితాలో అవకతవకలు ఉన్నట్లయితే వాటిని గుర్తించి, నిబంధనల ప్రకారం సంబంధిత ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఓటర్ల హక్కులను పరిరక్షించేందుకు రాజకీయ పార్టీలు, ప్రజలు ప్రజాస్వామ్యబద్ధంగా కలిసి పనిచేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో శ్రీనివాస్.బండారు మల్లయ్య.సిపిఎం మండల కమిటీ సభ్యులు మిన్నల్లాపురం ఎల్లయ్య. భైరగోని రాములు.రామగాళ్ల అశోక్ ఉన్నారు

## కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కార్యకర్తలు

**నల్లబెల్లి, అక్టోబర్ 03(జనంసాక్షి):** మండలంలోని నారక్కపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ క్రియాశీల కార్యకర్తలు శనివారం గ్రామ కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్ మాట్లాడుతూ నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్లూరి రమేష్, బీసీ సెల్ మండల ఉపాధ్యక్షుడు కుంచాల రాజు, గౌరవ అధ్యక్షుడు తిప్పని చేరాలు, గ్రామ ఉపాధ్యక్షుడు శ్రీపతి కుమారస్వామి, గౌరవ సలహాదారు రాజిరెడ్డి, మెర్గ మల్లయ్య, ఎస్సీ గ్రామ అధ్యక్షుడు మామిడి కృష్ణ, మాజీ వార్డు సభ్యుడు కోడూరు లింగమయ్య, నాయకులు ముత్నేని రాజకుమార్, గొట్టిముక్కుల శ్రీకాంత్ పాల్గొన్నారు.

## దళిత మహిళా సర్పంచ్ పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- కాంగ్రెస్ పార్టీ పట్టణ కార్యదర్శి మాతంగి దేవయ్య



**స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 03 (జనంసాక్షి) :** మండలంలోని విశ్వనాథపురం గ్రామంలో దళిత మహిళా సర్పంచ్ పై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని,ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నా మని స్టేషన్ ఘన్‌పూర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కార్య దర్శి మాతంగి దేవయ్య అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు గ్రామంలోని బెల్ట్‌షాపులను మూసి వేయాలని గ్రామపంచాయతీలో తీర్మానం చేసి, దాని అమలులో భాగంగా చర్యలు చేపడుతున్న సమయంలో కొంతమంది బెల్ట్‌షాపుల నిర్వాహకు లు, వారికి అండగా ఉన్న వ్యక్తులు గ్రామపంచాయతీ కార్యాలయం వద్దకు వచ్చి సిబ్బందిపై, దాడికి పాల్పడటం,అడ్డువచ్చిన సర్పంచ్‌పై కూడా దాడి చేయడం అత్యంత దుర్మార్గమైన చర్యఅని అన్నారు.డ్రగ్స్,బెల్ట్ షాపుల వల్ల ప్రజలు, ముఖ్యం గా యువత కుటుంబాలు ఎదుర్కొంటున్న సమ స్యలను దృష్టిలో పెట్టుకుని ప్రజల ప్రయోజనాల కోసం గ్రామపంచాయతీ తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేయడానికి సర్పంచ్, సిబ్బంది ప్రయత్ని స్తుంటే వారిపై దాడులు చేయడం సరైంది కాదని అన్నారు. దాడికి పాల్పడిన వారిపై పోలీసులు వెంటనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయా లని నిష్పక్షపాతంగా విచారణ జరిపి కఠిన చర్య లు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## చర్లపల్లి లో పోషణ మాసం పాల్గొన్న సర్పంచ్ బండి రేణుక శంకర్



**నడి కూడ ఆగస్టు 3 (జనం సాక్షి) :** నడి కూడ మండలం చర్లపల్లి గ్రామంలో శనివారం ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ బండి రేణుక శంకర్ పాల్గొన్నారు. పోషణ ప్రతిజ్ఞ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా కార్యకర్తలు ,గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు తల్లిదండ్రులు ఇతరులు పాల్గొన్నారు.

## ఎన్‌సీసీ మాస్ స్వచ్ఛతా కార్యక్రమం




**నర్సంపేట అక్టోబర్ 3 ( జనం సాక్షి) :** నర్సంపేట పట్టణంలోని విజ్ డమ్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన 10 టి బెటాలియన్ ఎన్ సిసి, వరంగల్ వారి ఆదేశాల మేరకు ఎన్ సిసి మెస్ స్విచ్ క్యాంపెయిన్ విజ్ డమ్ హై స్కూల్, ప్రిన్సిపాల్ జావేద్ శనివారం తెలిపారు ఆయన మాట్లాడుతూ భాగంగా ఎన్ సి సి క్యాడెట్లు పాఠశాల పరిసరాలు మరియు చుట్టుపక్కల ప్రాంతాల్లో శుభ్రత కార్యక్రమాన్ని చేపట్టి, పరిశుభ్రత, ఆరోగ్యం మరియు సామాజిక బాధ్యతపై అవగాహన కల్పించారు. అన్నారు , వైస్ ప్రిన్సిపాల్ ప్రకాశ్ . ఎన్ సి సి క్యాడెట్ల సేవలను అభినందించి, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు సమాజ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ప్రశాంత్ కుమార్ , రాజేష్ సమన్వయం చేశారు. క్యాడెట్లకు స్వచ్ఛ భారత్, వ్యక్తిగత పరిశు భ్రత, పరిసరాల పరిశుభ్రత మరియు పర్యావరణ పరిరక్షణ యొక్క ప్రాముఖ్యతను వివరించారు.

# వరంగల్ జిల్లాలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను తనిఖీ

**ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో**

**ఏటూరు నాగారం, అక్టోబర్ 03( జనం సాక్షి) :** విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన ఆరోగ్యం, సురక్షితమైన వసతులు, అవసరమైన మౌలిక సదుపాయాలు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో ఆదేశించారు. వరంగల్ డీటీడీఓతో కలిసి పీఓ లెనిన్ వత్సల్ టోప్పో వరంగల్ జిల్లాలోని ముదుచెక్కలపల్లి, వర్ధన్నపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలను సందర్శించి పాఠశాలల్లోని విద్యా బోధన, విద్యార్థుల అభ్యసన స్థాయి, ఆరోగ్య సదుపాయాలు, వసతులు, మౌలిక సదుపాయాలను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రెండు ఆశ్రమ పాఠశాలల్లోని తరగతి గదులు, డార్మిటరీలు, లైబ్రరీ, సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, హెల్త్ రూమ్‌లను పీఓ స్వయంగా పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి చదువు, పాఠ్యాంశాలపై అవగాహన, అభ్యసన స్థాయి, నోట్‌బుక్స్ నిర్వహణ తదితర అంశాలను తెలుసుకున్నారు. విద్యార్థులు పాఠ్యాంశాలను అర్థం చేసుకునేలా వారి స్థాయికి అనుగుణంగా బోధన అందించాలనిఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలల్లోని లైబ్రరీలను పరిశీలించిన పీఓ, అందుబాటులో ఉన్న పుస్తకాలు, విద్యార్థులు వాటిని వినియోగిస్తున్న విధానాన్ని తెలుసుకున్నారు. విద్యార్థుల్లో పఠన అలవాటును పెంపొందించేలా లైబ్రరీలను మరింత సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. సైన్స్ ల్యాబ్‌లలో



ప్రయోగ పరికరాలు, సామగ్రి వినియోగంపై వివరాలు తెలుసుకుని, విద్యార్థులకు ప్రయోగాత్మక అవగాహన కల్పించేందుకు ల్యాబ్‌లను సద్వినియోగం చేయాలని తెలిపారు. అలాగే కంప్యూటర్ ల్యాబ్‌లను పరిశీలించి, అందుబాటులో ఉన్న కంప్యూటర్లు, డిజిటల్ పరికరాలు, వాటి వినియోగంపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించేలా కంప్యూటర్ ల్యాబ్‌లను వినియోగించుకోవాలని సూచించారు. హెల్త్ రూమ్‌లను కూడా పీఓ ప్రత్యేకంగా పరిశీలించారు. తరగతి వారీగా విద్యార్థుల ఆరోగ్య వివరాలు, రోజువారీ ఆరోగ్య పరీక్షల నమోదు, అందుబాటులో ఉన్న మందులు, వైద్య సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన వైద్య సేవలు సకాలంలో అందేలా సమీపంలోని పీహెచ్‌సీలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. పాఠశాలల డార్మిటరీలు మరియు ఇతర మౌలిక వసతులను పరిశీలించిన పీఓ, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, పరిశుభ్రత విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, అవసరమైన సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ముదుచెక్కలపల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో కిటికీలకు మెష్ ఏర్పాటు చేయాలని విద్యార్థులు పీఓ దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించిన పీఓ ఏఈ (ట్రైబల్ వెల్ఫేర్) విశాల్ రెడ్డి పాఠశాలను పరిశీలించి అవసరమైన అంచనాలు సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు. అదేవిధంగా వర్ధన్నపేట ఆశ్రమ ఉన్నత పాఠశాలలో డ్రైనేజీ సమస్యను హెచ్‌ఎం, వార్డెన్ పీఓ దృష్టికి తీసుకురాగా, సంబంధిత ఏఈ (ట్రైబల్ వెల్ఫేర్) శంకర్ మున్సిపాలిటీ అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యను పరిష్కరించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని పీఓ ఆదేశించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రగతి, ఆరోగ్యం, క్రమశిక్షణతో పాటు క్రీడలు, సాంస్కృతిక, సృజనాత్మక మరియు ఇతర సహపాఠ్య కార్యక్రమాల్లో కూడా విద్యార్థులు చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహించాలని పీఓ సూచించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అదనపు శ్రద్ధ అవసరమైన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులకు తెలిపారు. రెండు ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న ప్రతి సదుపాయం సమర్థవంతంగా వినియోగించబడేలా హెచ్‌ఎంలు, వార్డెన్లు, ఉపాధ్యాయులు మరియు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని పీఓ లెనిన్ వత్సల్ టోప్పో స్పష్టం చేశారు.

# సిఎం సహాయనిధి పేదలకు ఓ వరం

**బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్**



**నేరడిగొండ, అక్టోబర్3 (జనంసాక్షి) :** ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం లాంటిదని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ పేర్కొన్నారు. శనివారం రోజున మండలంలోని వడూర్ గ్రామం తోపాటు పలు గ్రామాల్లో. ఆడే గజేందర్ పర్యటనలో. భాగంగా ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎం ఆర్ ఎఫ్) ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేసి వారికి భరోసా కల్పించారు.కైపల్లి శంకర్‌కురూ.22,500,బోలిశెట్టి లక్ష్మణ్‌కు రూ.36,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.అనంతరం గ్రామంలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల వడూర్ గ్రామానికి చెందిన రాజ్ రమేష్ మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి,మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తిత్రే నారాయణ్ సింగ్ సీనియర్ నాయకులు బుక రాములు,బోలిశెట్టి రాములు,బోథ్ బ్లాక్ ఆత్మ డైరెక్టర్లు మాజీ బోథ్ అసెంబ్లీ అధికార ప్రతినిధి యండి సద్దాం,మండల ప్రధాన కార్యదర్శి రాహిల్ మాలిక్ తదితరులు ఉన్నారు.

# బీడీ కార్మికులకు రూ.4000 చేయూత పెన్షన్ ఇవ్వాలి

- ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ డిమాండ్
- అక్టోబర్ 6 ఛలో భైంసా విజయవంతం చేయండి
- ముధోల్ లో బీడీ కార్మికుల ప్రచారం



**ముధోల్, అక్టోబర్ 03(జనం సాక్షి) :** రెక్కలు ముక్కలు చేసుకుని 30–40 ఏళ్లు బీడీ పరిశ్రమకు సేవ చేసిన కార్మికులను ప్రభుత్వం పట్టించు కోవడం లేదని, వెంటనే బీడీ కార్మికులు, ప్యాకర్లు, షేకర్లు, టేకేదార్లందరికీ నెలకు రూ.4000 చేయూత పెన్షన్ ఇవ్వాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.రాజన్న డిమాండ్ చేశారు. ముధోల్ నియోజకవర్గంలోని చార్ బాయి బీడీ పరిశ్రమలో శుక్రవారం యూనియన్ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. అక్టోబర్ 6న జరగనున్న "ఛలో భైంసా" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజన్న మాట్లాడుతూ, "ఉదయం నుంచి సాయంత్రం వరకు బీడీలు చుడుతూ తమ జీవితాలను పరిశ్రమకే అంకితం చేసిన కార్మికులకు వృద్ధాప్యంలో ఎలాంటి భద్రత లేదు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రతి బీడీ కార్మికుడికి రూ.4000 పెన్షన్ ఇవ్వాలి. మా సమస్యలు పరిష్కారం అయ్యేవరకు పోరాటం ఆగదు. అందుకే ఈ నెల 6న భైంసాలో జరిగే మహాధర్నాకు ముధోల్ నియోజకవర్గం నుండి వేలాదిగా తరలిరావాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు మీ.బక్కన్న, ఉపాధ్యక్షులు ఆర్.రామలక్ష్మణ్, జిల్లా నాయకురాలు వి.గోదావరి, టేకేదార్లు, ప్యాకర్లు, షేకర్లు, పెద్ద సంఖ్యలో బీడీ కార్మికులు పాల్గొన్నారు.

# గంగారంలో ఉచిత వైద్య శిబిరం

**నెన్నెల, అక్టోబర్ 3 (జనం సాక్షి) :** నెన్నెల మండలం గంగారం గ్రామంలో శనివారం ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో కొద్ది రోజులుగా పలువురు జ్వరాలతో బాధపడుతున్న నేపథ్యంలో వైద్య సిబ్బంది గ్రామానికి చేరుకుని ప్రజలకు వైద్య సేవలు అందించారు.

జ్వరపీడితులు, ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి రక్త నమూనాలను సేకరించారు. అనంతరం అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న ప్రజల పరిస్థితిని తెలుసుకుని వారికి చికిత్స అందించేందుకు వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ జాడి రాజ్ కుమార్ తెలిపారు.

# కెరమెరి మండల దివ్యాంగులకు శుభవార్త

**సదరం క్యాంప్ తేదీ ఖరారు**

**కెరమెరి, అక్టోబర్ 3 (జనంసాక్షి) :** కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కెరమెరి మండల దివ్యాంగుల కోసం సదరం వైద్య శిబిరం నిర్వహించనున్నారు. జైనూర్, కెరమెరి, లింగాపూర్, సిర్పూర్(యు) మండలాలకు చెందిన దివ్యాంగులకు ఈ నెల 6వ తేదీన జైనూర్ ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి (సిహెచ్సి) లో ఎముకలకు సంబంధించిన (ఆర్థోపెడిక్) వైకల్య నిర్ధారణ శిబిరం జరగనుంది. ఈ అవకాశాన్ని కెరమెరి మండలంలోని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. క్యాంప్ కు వచ్చేవారు తమ వెంట పాత వైద్య పత్రాలు తప్పకుండా తీసుకురావాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ (డి ఆర్ డి ఏ) అధికారి తెలిపారు.

# వన్యప్రాణి సంరక్షణ అందరి బాధ్యత

**ఎఫ్‌డీఓ రామ్మోహన్**

**జన్నారం, అక్టోబర్ 03 (జన్నం సాక్షి):** అడవుల వల్లే మనవాళ్లకి స్వచ్ఛమైన ఆక్సిజన్ లభిస్తుందని జన్నారం అటవీ డివిజనల్ అధికారి (ఎఫ్‌డీఓ) ఎం. రామ్మోహన్ అన్నారు. వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా రెండో రోజైన శనివారం కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లోని జన్నారం అటవీ డివిజన్ ఇందన్‌పల్లి ఫారెస్ట్ రేంజ్ పరిధిలో కార్యక్రమం నిర్వహించారు. నార్లాపూర్ దక్షిణం బీట్ గేటు నంబర్--1 వద్ద నుంచి ఎఫ్‌డీఓ రామ్మోహన్ విద్యార్థులు, అటవీ సిబ్బందితో కలిసి కాలినడకన మైసమ్మకుంట వరకు వెళ్లారు. కలియానగర్ శాతవాహన యూనివర్సిటీకి చెందిన ఎంఎస్సీ బయోలాజికల్ సైన్స్ విద్యార్థులు 27 మంది, ప్రొఫెసర్లు ఎస్. కిరణ్, ఎల్. శ్రీనివాస్, శివకుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సర్కార్ వైఖరిపై ఆర్ఎంపీల సమరభేరి!

**డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత**



**దిలావర్‌పూర్ , అక్టోబర్ 03 (జనం సాక్షి):** గ్రామీణ ప్రాంత ప్రజల ప్రాణాలు కాపాడుతున్న ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యల పట్ల పాలకులు అనుసరిస్తున్న తీరుపై దిలావర్‌పూర్ మండల ఆర్ఎంపీ/పీఎంపీ అసోసియేషన్ నాయకులు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ తక్షణమే శిక్షణనిచ్చి, అధికారికంగా గుర్తింపు కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండల కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ రాజేష్ కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అరకొరగా ఉన్న పల్లెల్లో, అర్ధరాత్రి వేళల్లో సైతం ప్రాథమిక చికిత్స అందిస్తూ తమ జీవితాలను పణంగా పెడుతున్నామని స్పష్టం చేశారు. 2009లో జారీ చేసిన జీవో (+.సా. చీకి. 1273/429) ప్రకారం శిక్షణ ఇచ్చి గుర్తింపు ఇస్తామన్న హామీ ఇప్పటికీ నెరవేరకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని నిలదీశారు. ఇప్పటికైనా ప్రభుత్వం కాలయాపన చొరవను పక్కనపెట్టి, అర్హులైన ఆర్ఎంపీ, పీఎంపీలకు తక్షణమే శిక్షణనిచ్చి గుర్తింపు ఇవ్వాలని, లేని పక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తమ వినతిని వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూడాలని డిప్యూటీ తహసీల్దార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు శివశరణ్, కార్యదర్శి ధనంజయ్, ఉపాధ్యక్షులు వెంక గారి భూమయ్య, కన్న సాయన్న, రవి, సంయుక్త కార్యదర్శి లు ప్రభాకర్, భీమేష్, సాయినాథ్, సురేందర్ రెడ్డి, సభ్యులు మురళి, సజ్జల్ అలీ, రమణారెడ్డి. అశోక్, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

# రోడ్లపై యథేచ్ఛగా పశువుల సంచారం

**బెంబేలెత్తుతున్న వాహనదారులు**



**తాండూర్, అక్టోబర్ 03(జనం సాక్షి) :** మంచిర్యాల జిల్లా తాండూరు మండల కేంద్రంతో పాటు మండలంలోని ప్రధాన రహదారులపై పశువుల సంచారం రోజురోజుకూ మితిమీరిపోతోంది. స్థానిక రోడ్లపై పశువులు యథేచ్ఛగా గుంపులు గుంపులుగా తిరుగుతూ, రహదారి నడిబొడ్డున తిష్ట వేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గాల్లో పశువులు అడ్డురావడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. రహదారుల వెంట ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు, ఆటోలు మరియు ఇతర వాహనాలు అకస్మాత్తుగా పశువులు అడ్డు రావడంతో అదుపు తప్పి కిందపడిపోతున్నారు. తీవ్ర గాయాలపాలవుతున్న ఘటనలు మండలంలో నిత్యకృత్యంగా మారాయి. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ఘాడ చీకటిలో రోడ్లపై ఉన్న పశువులు సరిగ్గా కనిపించకపోవడంతో వాహనదారులు వాటిని ఢీకొట్టి ప్రమాదాల బారిన పడుతున్నారు.

పశువుల యజమానులు తమ పశువులను పాకల్లో ఉంచకుండా, పగలు రాత్రి తేడా లేకుండా రోడ్లపైకి వదిలేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటు అధికారులు గానీ, అటు సంబంధిత యంత్రాంగం గానీ దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఉన్నతాధికారులు స్పందించి, రోడ్లపై తిరుగుతున్న పశువులను గోశాలలకు లేదా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, పశువులను రోడ్ల మీదకు వదిలేసే యజమానులకు భారీ జరిమానాలు విధించి కఠిన చర్యలు తీసుకోవాలని తాండూరు మండల ప్రజలు మరియు వాహనదారులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు

# నేరాల నియంత్రణే లక్ష్యం.. అక్రమాలకు అడ్డుకట్ట వేయడమే ధ్యేయం

- **మంచిర్యాలలో వాణిజ్య సంస్థలు, లాడ్జీలు, బ్యాంకులు, గోల్డ్ షాపుల వద్ద ప్రత్యేక తనిఖీలు**
- **నంబర్ ప్లేట్ లేని వాహనాలపై ప్రత్యేక నిఘా.. చట్టపరమైన కఠిన చర్యలు తప్పవు:**
- **మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ .**



**మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్ 3 (జనంసాక్షి) :** నేరాల నియంత్రణ, అనుమానాస్పద వ్యక్తులు , వాహనాల కదలికలపై నిఘా పెంచేందుకు నాకాబంది కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్ తెలిపారు. శనివారం నాడు మంచిర్యాల జిల్లా కేంద్రంలో నాకాబందీలో భాగంగా వాణిజ్య సంస్థలు, లాడ్జీలు,మార్కెట్ ప్రాంతాలు, బ్యాంకులు,గోల్డ్ షాపులు తదితర ముఖ్యమైన ప్రాంతాల్లో పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు .ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ... బ్యాంకులు, బంగారు దుకాణాలను లక్ష్యంగా చేసుకుని జరిగే చోరీలు, దోపిడీలను ముందుగానే అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బ్యాంకులకు వచ్చే ఖాతాదారుల దృష్టిని మళ్లించి నగదు, విలువైన వస్తువులను అపహరించే ముఠాల కదలికలపై కూడా పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ముఖ్యమైన ప్రాంతాలు, రహదారులు, సరిహద్దుల్లో ఆర్మ్డ్ పోలీస్ సిబ్బంది, ప్రత్యేక బృందాల సహకారంతో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు డీసీపీ తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా తమ వాహనాలకు సరైన నంబర్ ప్లేట్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నంబర్ ప్లేట్‌ను వంచడం,మార్చడం లేదా నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపడం చేయరాదన్నారు. నంబర్ ప్లేట్ లేని లేదా స్పష్టంగా గుర్తించలేని వాహనాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తారని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు,చెల్లుబాటు అయ్యే ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. వాహనాలకు సరైన నంబర్ ప్లేట్‌తో పాటు అన్ని పత్రాలు సక్రమంగా ఉంటే పోలీసుల తనిఖీల సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. మంచిర్యాల మహారాష్ట్ర సరిహద్దుకు సమీపంలో ఉన్నందున నేరాలకు పాల్పడిన వ్యక్తులు సరిహద్దులు దాటి పారిపోయే అవకాశాలను అరికట్టేందుకు సరిహద్దు ప్రాంతాల్లో నిఘాను మరింత పటిష్టం చేస్తున్నట్లు డీసీపీ తెలిపారు. పోలీసులు 24ఐ7 అప్రమత్తంగా అందుబాటులో ఉంటారని, ఆర్మ్డ్ పోలీస్ బృందాలు కూడా అవసరమైన ప్రాంతాల్లో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న నాకాబంది పోలీసుల సన్నద్ధత,నేర నియంత్రణ వ్యవస్థను మరింత బలోపేతం చేసే కార్యక్రమంలో భాగమని, కమిషనరేట్ పరిధిలోని ముఖ్యమైన ప్రాంతాలు, రహదారులు, సరిహద్దుల్లో ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని డీసీపీ తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ తమ వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను సక్రమంగా ఉంచుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని డీసీపీ సూచించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల పట్టణ ఇన్‌స్పెక్టర్ ప్రమోదరావు,ట్రాఫిక్ పోలీసులు,స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## స్వచ్ఛతతో ఆరోగ్యం- ఉత్పాదకతలో పురోగతి

- **స్పెషల్ క్యాంపెయిన్-6లో జీఎం ఎన్. రాధాకృష్ణ పిలుపు**

**రామకృష్ణాపూర్, అక్టోబర్ 03(జనంసాక్షి):** పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ నిత్యజీవితంలో భాగంగా చేసుకోవాలని సింగరేణి మందమర్రి ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ సూచించారు. శనివారం జీ.ఎం. కార్యాలయ ఆవరణలో నిర్వహించిన 'స్వచ్ఛ భారత్–స్పెషల్ క్యాంపెయిన్–6 ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ అపరిశుభ్ర పరిసరాలతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని అన్నారు. గనులు, కార్యాలయాల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉద్యోగుల పనితీరును మెరుగుపరిచి ఉత్పాదకత పెంపునకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వారానికి కనీసం రెండు గంటలు శ్రమదానం చేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రతతో పాటు భద్రతా ప్రమాణాలు పాటిస్తూ ఉత్పత్తి సాధించాలని సూచించారు. అనంతరం అధికారులు, సిబ్బందితో స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్వో టు జీఎం జి.ఎల్. ప్రసాద్, డీజీఎం (పర్సనల్) సీహెచ్. అశోక్, పీవో ఎం. కార్తీక్, పర్యావరణ అధికారి కాతం వెంకట్‌రెడ్డి, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## కెరమెరి మండలంలో పర్యటించిన అజ్మీరా శ్యామ్ నాయక్

- **బాధిత కుటుంబాలను పరామర్శ**

కెరమెరి, అక్టోబర్ 3 (జనంసాక్షి) : కెరమెరి మండలం దేవాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మాజీ ఎంపీటీసీ రాథోడ్ అంబాజీ మాతృమూర్తి గురిబాయి శుక్రవారం రాత్రి మృతి చెందగా అంత్యక్రియల నిమిత్తం వారి నివాసానికి వెళ్లి ఆసిఫాబాద్ కాంగ్రెస్ ఇంచార్జి అజ్మీరా శ్యామ్ నాయక్ నివాళులర్పించారు. అలాగే ఇటీవల మృతి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సుల్తాన్‌గూడ గ్రామ పెద్ద షేక్ ముషా సాహెబ్ కుటుంబాన్ని పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. వారి వెంట మండల అధ్యక్షుడు సుజాయిత్ ఖాన్,ఎల్లప్ప, రజాక్, సుదర్శన్, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఇన్చార్జి జడ్జిగా బి.నిఖిత



**ఖానాపూర్ అక్టోబర్ 03 (జనం సాక్షి) :** ఖానాపూర్ కోర్టు నూతన ఇంచార్జి జడ్జిగా బి.నిఖిత శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆమెకు ఘన స్వాగతం పలికారు. అదే సమయంలో బదిలీపై వెళ్తున్న జడ్జి భవిష్య కు బార్ అసోసియేషన్ సభ్యులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మట్టేరి రాజశేఖర్, సీనియర్ న్యాయవాది వెంకట మహేంద్ర, కార్యదర్శి బాశెట్టి శివ, కార్యవర్గ సభ్యులు షబ్బీర్ పాషా, నరేంద్రనాథ్, షేక్ ఖదీర్, రాచమల్ల అశోక్ లతోపాటు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# మంచిర్యాల జోన్‌లో పోలీస్ నాకాబందీ



**బెల్లంపల్లి, అక్టోబర్ 3, (జనంసాక్షి) :** రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు, మంచిర్యాల డీసీపీ ఏ భాస్కర్ పర్యవేక్షణలో మంచిర్యాల జోన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులు ఏకకాలంలో ఆకస్మిక నాకాబంది నిర్వహించి వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు. అక్రమ రవాణా, గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టడం. అనుమానిత వ్యక్తులు, వాహనాలను గుర్తించడం, దొంగతనాలు, చైన్ స్నాచింగ్ వంటి నేరాలను నియంత్రించడం. అవాంఛనీయ సంఘటనలను నివారించడం ప్రధాన లక్ష్యంగా ఈ తనిఖీలు చేపట్టారు. నాకాబంది సమయంలో అనుమానాస్పద వాహనాలు, వ్యక్తులను ఆపి సమగ్రంగా తనిఖీ చేశారు. వాహనాల రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్, పొల్యూషన్ సర్టిఫికేట్ తదితర పత్రాలను పరిశీలించారు. డ్రంక్ అండ్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా వాహనం నడపడం, సరైన వాహన పత్రాలు లేకుండా ప్రయాణించడం వంటి ట్రాఫిక్ ఉల్లంఘనలపై కేసులు నమోదు చేసి, జరిమానాలు విధించారు. వాహనదారులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనదారుల వివరాలు, వారు ప్రయాణిస్తున్న గమ్యం, వాహనాల్లో ఉన్న వ్యక్తుల వివరాలను కూడా పోలీసులు పరిశీలించారు.

మంచిర్యాల జోన్‌లో శాంతిభద్రతలను కాపాడటంతో పాటు చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు ఇలాంటి నాకాబంది, వాహన తనిఖీలను రాబోయే రోజుల్లో కూడా మరింత కఠినంగా కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# తుర్కం చెరువులో పక్షుల సందడి

**వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించాలి**




మామడ అక్టోబర్ 03,(జనంసాక్షి ): వన్యప్రాణులు, జీవజాతుల సంరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని దిమ్మదుర్తి ఎఫ్ఆర్ఓ టి. శ్రీనివాసరావు అన్నారు. 72వ జాతీయ వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా తుర్కం చెరువు వద్ద శనివారం బర్డ్ వాచింగ్ కార్యక్రమం నిర్వహించారు. దిమ్మదుర్తి, కప్పనపల్లి గ్రామాల ప్రజలు, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ మాట్లాడుతూ.. ప్రతి ఏడాది అక్టోబర్ మొదటి వారంలో వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహిస్తూ వాటి ప్రాధాన్యం, సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వాతావరణ మార్పులు, అడవుల నరికివేత, పోడు వ్యవసాయం, అటవీ భూముల ఆక్రమణ, అభివృద్ధి పనుల కోసం అటవీ భూముల వినియోగం తదితర కారణాలతో జీవజాతులు ప్రమాదంలో పడుతున్నాయని పేర్కొన్నారు. ఒక జీవి మరో జీవిపై ఆధారపడి ఆహార గొలుసులో జీవిస్తుందని, జీవావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి జీవజాతి సంరక్షణ అవసరమన్నారు. పక్షులతో పర్యావరణానికి మేలు: పక్షులు పంటలు, అడవుల్లోని క్రిమి కీటకాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా చీడపీడలను నియంత్రించడంలో కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. విత్తన వ్యాప్తి, మొక్కల పరాగసంపర్కానికి కూడా పక్షులు దోహదపడతాయన్నారు. ఒక ప్రాంతంలో వివిధ రకాల పక్షులు అధికంగా కనిపిస్తే అక్కడి జీవావరణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉన్నట్లు భావించవచ్చన్నారు. కార్యక్రమంలో నిర్మల్ ఎఫ్ఆర్ఓ జి.వి. రామకృష్ణారావు, దిమ్మదుర్తి, కప్పనపల్లి గ్రామాల ప్రజలు, నిర్మల్, దిమ్మదుర్తి, మామడ అటవీ క్షేత్రాల సిబ్బంది పాల్గొన్నారు.

## మాన్కుగూడ వేదికపై మాజీ ఎమ్మెల్యే ఘాటు వ్యాఖ్యలు

- **ఆదర్శ గ్రామ మాజీ సర్పంచ్ పై మండిపాటు**
- **అహంకారమే గద్దె దించింది: మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు.**




**బజార్హత్నూర్ /ఇచ్చోడ( జనం సాక్షి):** ఇచ్చోడ మండలం మాన్కుగూడ గ్రామంలో తెలంగాణ రక్షణ సేన ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు పార్టీ చేరికల కార్యక్రమంలో భాగంగా మాజీ ఎంపీటీసీ పై చేసిన ఘాటు వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారింది. ముఖ్రా కే గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితుల్లో అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న నేను అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులను కలిసి ఆదర్శ గ్రామానికి(ముఖ్రా కే) బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రత్యేకంగా కృషిచేసి నిధులు మంజూరు చేయించానన్నారు.. బ్రిడ్జ్ రహదారి నిర్మాణం చేపట్టి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించానన్నారు. ఆదర్శ సర్పంచులు ప్రజాప్రతినిధులుగా గుర్తింపు పొందడంతో ఢిల్లీ స్థాయిలో పిలుపు రావడంతో నేరుగా సీఎం మంత్రుల దృష్టికి వెళ్లే వారని ఇంతటి కృషి చేసిన నాకు ఒక్క మాట కూడా చెప్పేవాడు కాదని అన్నారు. గుర్తింపు అధికారం ఉందని అహంకారానికి తావివ్వకూడదని ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఆ ప్రభావంతోనే ప్రస్తుతం ఆ గ్రామంలో పాలకవర్గం పూర్తిగా మారిపోయిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజా ప్రతినిధులకు అధికారం శాశ్వతం కాదని ప్రజల ఆదరాభిమానాలే అసలైన గుర్తింపనీ అన్నారు. తలకెక్కిన పదవులు దక్కవున్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల అధ్యక్షులు బిలాల్ నాయకులు మారుతి ముస్తఫా కలీం జంగు గ్రామ పటేల్ దేవారి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.